Read mahabharatam online | www.telugubooks.tk

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam,
B.A., B.G.L.

2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.

Ph:040-24048104

శ్రీరామ ఓం ఓం

శుక్లాంబరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం

ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే

శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షో ముఖాఙ్గేషు యే

లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీ పుం సయోగో ద్భవాం

తే వేదత్రయమూర్తయ స్త్రి పురుషా స్సమ్పూజితా వస్సురై

ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే.

ఓం గణానాంత్వా గణపతిగ్ం హవామహే

కవిం కవీనా ముప మశ్ర్వవస్తమం

జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత

ఆనః శృణ్వన్నూతిభిః సీదసాదనం

ఓం శ్రీ మహాగణాధిపతయేనమః.

ప్రణోదేవీ సరస్వతీ వాజేభి ర్ వాజినీవతీ

ధీనామ విత్ర్యవతు

ఆనోదివో బృహతః పర్వతాదా సరస్వతీ

యజతాగంతు యజ్ఞం

హవందేవీ జుజుషాణాఘృతాచీ శగ్మాం

నో వాచ ముశతీ శృణోతు.

Read mahabharatam online | www.telugubooks.tk

వ్యాసం వసిష్ట నప్తారం శక్తేః పౌత్ర మకల్మషం
పరశరాత్మజం వందే శుకతాతం తపోనిధిం.
వ్యాసాయ విష్ణు రూపాయ వ్యాసరూపాయ విష్ణవే
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః.

# మహాభారతం

## ఆదిపర్వము

### ప్రథమాశ్వాసము.

నైమిశారణ్య పుణ్య క్షేత్రమున శౌనకుడు అనే మహా ముని సత్ర యాగం చేస్తున్నాడు. ఆ మునుల వద్దకు రోమహర్షణుడను వాని కుమారుడు, ఉగ్రశ్రవసుడు అను సూతుడు వచ్చాడు.

సూతుడు అక్కడ ఉన్న మునిసంఘమునకు నమస్కరించి తాను వ్యాస మహర్షి శిష్యుండైన రోమహర్షణునకు పుత్రుడననియు, పుణ్య కధలు చెప్పుటలో సమర్ధుడననియు చెప్పెను. అప్పుడు అక్కడ ఉన్న శౌనకాది మహా మునులు తమకు ఒక పుణ్య కధ వినవలెనని కోరిక కలదని చెప్పారు. అప్పుడు ఉగ్రశ్రవసుడు వారికి ఒక కధ చెప్ప సాగాడు.

పూర్వము. కృష్ణద్వైపాయనుడు అను బ్రహ్మర్షి, ఒకటిగా కలిసి ఉన్న వేదములను, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ

వేదము, అని నాలుగు వేదములుగా విభజించాడు. తరువాత బ్రహ్మ చేత అనుమతి పొంది అష్టాదశ పురాణములను, ధర్మ శాస్త్రములను, ఇతిహాసములను, రాజ వంశ చరిత్రలను, శ్రీ కృష్ణుని మహాత్మ్యమును, పాండవాది భారతవీరుల కథలను రచించాడు.

ఈ మహాభారత గ్రంధాన్ని, ధర్మ తత్వజ్ఞులు ధర్మ శాస్త్రమని అంటారు. ఆధ్యాత్మ విదులు, వేదాంత మని అంటారు. నీతి కోవిదులు నీతి శాస్త్రమనిఅంటారు. కవులు మహా కావ్యమని అంటారు. లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని అంటారు. ఐతిహాసికులు ఇది ఇతిహాస మని అంటారు. పౌరాణికులు, దానిని పురాణమని అంటారు.

మహాభారతంలో 18 పర్వాలు ఉన్నాయి. అవి—-

1.ఆదిపర్వము— ఇందులో 9984 శ్లోకాలు ఉన్నాయి.
2.సభా పర్వము— ఇందులో 4311 శ్లోకాలు ఉన్నాయి.
3.అరణ్య పర్వము— ఇందులో 13664 శ్లోకాలు ఉన్నాయి.
4.విరాట పర్వము— ఇందులో 3500 శ్లోకాలు ఉన్నాయి.
5.ఉద్యోగ పర్వము— ఇందులో 6998 శ్లోకాలు ఉన్నాయి.
6.భీష్మ పర్వము— ఇందులో 5884 శ్లోకాలు ఉన్నాయి.
7.ద్రోణపర్వము— ఇందులో 10919 శ్లోకాలు ఉన్నాయి.
8.కర్ణ పర్వము— ఇందులో 4900 శ్లోకాలు ఉన్నాయి.

9.శల్య పర్వము— ఇందులో 3220 శ్లోకాలు ఉన్నాయి.
10.సౌప్తిక పర్వము— ఇందులో 2870 శ్లోకాలుఉన్నాయి.
11.స్త్రీ పర్వము— ఇందులో 1775 శ్లోకాలు ఉన్నాయి.
12.శాంతి పర్వము— ఇందులో 14525 శ్లోకాలుఉన్నాయి.
13.అనుశాసనిక పర్వము— ఇందులో 12000 శ్లోకాలు ఉన్నాయి.
14.ఆశ్వమేధిక పర్వము— ఇందులో 4420 శ్లోకాలు ఉన్నాయి.
15.ఆశ్రమ వాస పర్వము— ఇందులో 1106 శ్లోకాలు ఉన్నాయి.
16. మౌసల పర్వము—— ఇందులో 300 శ్లోకాలు ఉన్నాయి.
17. మహాప్రస్థానిక పర్వము— ఇందులో 120 శ్లోకాలు ఉన్నాయి.
18.స్వర్గారోహణ పర్వము— ఇందులో 200 శ్లోకాలు ఉన్నాయి.

ఈ మహాభారతాన్ని దేవలోకంలో చెప్పుటకు నారదమహర్షిని, పితృలోకములో చెప్పుటకు దేవలుడిని, గరుడ గంధర్వ,యక్ష,రాక్షస లోకములలో చెప్పుటకు శుకుని, మనుష్య లోకమున జనమేజయునకు చెప్పుటకు వైశంపాయనుని పంపెను. నేను ఆ వైశంపాయన ముని వలన ఈ మహాభారత కధ వింటిని. అది మీకుచెప్పుచున్నాను. అనిచెప్పగా, ఆ శౌనకాది మహా మునులు ఆ కధకుని చూచి,

"అయ్యా, మాకు శమంత పంచకము గురించివివరించండి. ఈ మహాభారత కధ జరగడానికి కారణమేమిటోచెప్పండి. భీష్మాది కురువీరుల గురించి మాకు సవిస్తరముగచెప్పండి" అని అడిగారు. అప్పుడు ఆ కధకుడు ఈ విధంగా చెప్పాడు.

మనకు నాలుగు యుగములు ఉన్నాయి. అవి కృత యుగము. త్రేతాయుగము. ద్వాపర యుగము. కలి యుగము. కృత యుగము ఆఖరులో దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరిగింది. త్రేతాయుగము ఆఖరులో రాముడికి, రావణాసురుడికి యుద్ధం జరిగింది. ద్వాపరయుగము ఆఖరులో పాండవులకు కౌరవులకు మహాభారత యుద్ధం జరిగింది.

త్రేతాయుగము, ద్వాపర యుగము సంధిలో, జమదగ్ని కుమారుడు, పరశు రాముడు 21 సార్లు క్షత్రియులతో యుద్ధము చేసి, క్షత్రియులను అందరిని చంపాడు. ఆ క్షత్రియుల శరీరముల నుండి కారిన రక్తమును ఐదు మడుగులు గా ఏర్పరిచాడు. ఆ మడుగులలో తన తండ్రికి తర్పణము విడిచాడు. ఆ ఐదు రక్తపు మడుగులు కల స్తలమును శమంత పంచకము అని పిలుస్తారు. ఆ శమంత పంచకము లో పాండవులు, కౌరవులు యుద్ధము చేసారు కాబట్టి, ఆప్రదేశాన్ని కురుక్షేత్రము అని పిలుస్తారు.

పాండవ వంశములో పుట్టిన వాడు అర్జునుడు. అర్జునుని కుమారుడు పరీక్షిత్తు మహారాజు. అతనికుమారుడు, జనమేజయుడు. జనమేజయ మహారాజు ఒక యజ్ఞము చేస్తున్నాడు. ఆ యజ్ఞము చేసే ప్రదేశంలో సరమఅనే దేవ శునకము (కుక్క) కొడుకు సారమేయుడు అనే కుక్క పిల్ల ఆడుకుంటూ ఉంది. జనమేజయుని తమ్ములు శ్రుతసేనుడు, భీమ సేనుడు, ఉగ్రసేనుడు అను వారలు వచ్చి, ఆ సారమేయుడు అనే కుక్కను కొట్టారు. వాడు అరుస్తూ వెళ్లిజరిగిన విషయం తన తల్లికి చెప్పాడు.

అప్పుడు సరమ జనమేజయుని వద్దకు వచ్చి "ఓ రాజా, నీ తమ్ములు నా కొడుకును అకారణంగా కొట్టారు. ఇది ధర్మము కాదు. ఇలాంటి పనులు చేసిన వారికి అకారణంగా ఆపదలు వస్తుంటాయి" అని చెప్పి అక్కడి నుండి వెళ్లి పోయింది.

తరువాత కొన్ని దినములకు, దేవతల శునకము ఐన సరమ పలికిన పలుకులకు శాంతి కర్మలు చేయుటకు జనమేజయుడు సంకల్పించాడు. సోమశ్రవసుడు అనే మహామునిని తనకు పురోహితునిగా నియమించు కున్నాడు.

అది అటుల ఉండగా, ఉదంకుడు అను ఒక ముని కుమారుడు గురుకులంలో విద్యను అభ్యసించాడు. అణిమాది అష్ట సిద్ధులు సాధించాడు. ఒక నాడు గురు పత్ని అతనితో తనకు పౌష్యుడు అను మహా రాజు భార్య వద్ద నున్న కుండలములు కావాలని కోరింది. అవి తెచ్చుటకు ఉదంకుడు పౌష్య మహారాజు వద్దకు వెళ్లాడు. కుండలములు కావాలని అడిగాడు.

అప్పుడు పౌష్యుడు " ఉదంకా, ఆ కుండలములు నా భార్య పౌష్యా దేవి ధరించి ఉన్నది. నా మాటగా చెప్పి ఆమె వద్దనుండి తీసుకొనుడు" అని చెప్పాడు.

అప్పుడు, ఉదంకుడు, పౌష్య మహాదేవి వద్దకు వెళ్లి కుండలములు ఇమ్మని అడిగాడు. అప్పుడు పౌష్య మహా దేవి తన వద్ద నున్న కుండలములను ఉదంకునకు ఇచ్చి

"ముని కుమారా, ఈ కుండలముల కొరకు నాగ రాజు తక్షకుడు ప్రయత్నిస్తున్నాడు. జాగ్రత్తగా తీసుకొని వెళ్ళు" అని చెప్పింది.

ఆ దంపతుల కోరిక మేరకు, ముని కుమారుడు పౌష్యుని ఇంటిలో భోజనము చేసాడు. భోజన సమయంలో వడ్డించిన అన్నములో ఒక వెంట్రుక వచ్చింది. దానికి ఉదంకుడు కోపించి,సరిగా చూడకుండా అన్నము పెట్టినందుకు పౌష్యుడిని గుడ్డివాడివి కమ్మని శపించాడు.

పౌష్యుడు కోపించి "మునికుమారా, చిన్న దోషమునకు నాకు ఇంత పెద్ద శాపాన్ని ఇస్తారా. నేను ప్రతి శాపం స్తున్నాను. నువ్వు సంతాన విహీనుడవు కమ్ము" అని శపించాడు.

మునికుమారుడు శాపాన్ని ఉపసంహరించమని పౌష్యుడిని కోరాడు. దానికి పౌష్యుడు "ముని కుమారా, మనసు నవనీతము, మాట వజ్రాయుధము—ఇది బ్రాహ్మణుల స్వభావము. కాని నా లాంటి క్షత్రియులకు, ఈ రెండును విపరీతములే. అందుకని నేను నా శాపమును ఉపసంహరించలేను. నీవే నీ శాపమును ఉపసంహరింపుము" అని కోరాడు. ఉదంకుడు " నీకు కొద్ది కాలములో శాప విమోచన అగును" అని చెప్పాడు

ఉదంకుడు సకాలములో గురు పత్నికి కుండలములు అంద చేయవలెనని తన ఆశ్రమానికి వెలుతూ దారి మధ్యలో, ఒక జలాశయము వద్ద ఆగి, శుభ్రమైన ప్రదేశములో, ఆకుండలములను పెట్టి, స్నానము చేస్తున్నాడు. అప్పుడు తక్షకుడు అక్కడకు వచ్చి

ఆకుండలములను అపహరించి నాగ లోకానికి పారిపోయాడు. ఇది చూచి ఉదంకుడు, అతని వెంట నాగ లోకమునకు వెళ్లాడు.

అక్కడ ఉదంకుడు, నాగ ప్రముఖులైన అనంతుడు, వాసుకి, తక్షకుడు మొదలైన నాగరాజులను భక్తితో స్తుతించాడు. అప్పుడు ఒక మహా పురుషుడు (ఇంద్రుడు) గుర్రము ఎక్కి అతని వద్దకు వచ్చాడు.

"ఉదంకా, నీ భక్తికి సంతోషించాను.నీకు ఏమి కావాలో కోరుకో" అని అడిగాడు. దానికి ఉదంకుడు "ఈ నాగ కులమెల్ల నాకు వశము కావలెను" అని కోరుకున్నాడు. అలాగే అని ఆ దివ్య పురుషుడు వరము ఇచ్చాడు. గుర్రము చెవిలో ఊద మన్నాడు. వెంటనే ఆగుర్రము నుండి భయంకర అగ్ని జ్వాలలు వచ్చాయి.నాగ కులములో భయం పుట్టింది. తక్షకుడు భయపడి కుండలములను తెచ్చి ఉదంకునకు ఇచ్చాడు.

వెంటనే ఉదంకుడు తన ఆశ్రమమునకు పోయి గురుపత్నికి కుండలములను ఇచ్చాడు. ఆమె కూడా సంతోషించి, ఆ కుండలములను ధరించింది. విద్యాభ్యాసము పూర్తి అయినందున, ఉదంకుడు గురుకులాన్ని విడిచి వెళ్లిపోయాడు.

కాని ఉదంకుడు, తన వద్దనుండి కుండలములను దొంగిలించినందుకు, తక్షకునికి తగిన ప్రతీకారం చెయ్యవలెనని మనసులో అనుకున్నాడు. జనమేజయ మహారాజు వద్దకు వెళ్లాడు.

"జన మేజయ మహారాజా, తక్షకుడు కుటిల స్వభావుడు. నాకు అపకారం చేశాడు. గురు పత్నికి ఇవ్వవలసిన కుండలములు అపహరించాడు. పైగా, ఇది తప్పు అని తలచ కుండా శృంగి అనే బ్రాహ్మణుడి వాక్కు ప్రకారము మీ తండ్రి గారైన పరీక్షిన్మహారాజును అతి క్రూరంగా చంపాడు. తమరు అతనికి బుద్ధి చెప్పాలి. ఆ దుష్టుడు తక్షకుడు చేసిన పని వల్ల నాగకులమంతా నాశనం కావాలి. అందువల్ల, తమరు సర్ప యాగం చెయ్యాలి. ఆ యాగాగ్ని జ్వాలలలో పడి, తక్షకుడు, అతని నాగ కులము నశించాలి" అని కోరాడు. దానికి సమ్మతించి జనమేజయుడు, సర్ప యాగము చేయుటకు సంకల్పించాడు.

అప్పుడు శౌనకాది మహా మునులు కధకుని చూచి,

"అయ్యా, అసలు ఈ నాగ కులమంతా మంటల్లో పడి మరణించడానికి కారణ మేమి?" అని అడిగారు.

"పూర్వము, పాములందరికి తల్లి అయిన కద్రువ తన కుమారులకు ఇచ్చిన శాపం కారణంగా నాగ కులమంతా జనమేజయుడు చేసిన సర్ప యాగంలో పడి నశించింది. కాని ఆస్తీకుడు అనే మహా ముని ఆ సర్ప యాగాన్ని నివారించాడు. మీకు ఆ కధ చెపుతాను వినండి" అని చెప్పసాగాడు.

పూర్వ కాలంలో భృగువు అనే మహా ముని ఉన్నాడు. ఆయన భార్య పేరు పులోమ. ఆమె నిండు గర్భవతిగా ఉండగా ఒక రోజు భృగువు స్నానానికి వెలుతూ పులోమతో హోమాగ్ని సిద్ధం చెయ్యమని చెప్పి వెళ్లాడు.

అప్పుడు పులోముడు అనే రాక్షసుడు అక్కడకు వచ్చాడు.పులోమను చూచాడు. ఆమె సౌందర్యాన్ని చూచి మోహించాడు. వెలుగుతున్న అగ్నిని చూచి " అగ్ని దేవా ఆమె ఎవరు?" అని అడిగాడు.

అగ్నిదేవుడు సందిగ్ధంలోపడ్డాడు.నిజం చెబితే భృగువు కోపించి శాప మిస్తాడు. చెప్పక పోతే అసత్యం చెప్పినట్లు అవుతుంది. అసత్య దోషాని కి భయపడి "ఆమె భృగువు భార్య" అని నిజంచెప్పాడు.

అసలు విషయం ఏమంటె, పులోమకు పెళ్లి కాక ముందు, పులోముడు ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నాడు. కాని పులోమను భృగువు పెళ్లాడాడు. నిజం తెలుసుకున్న ఆ రాక్షసుడు, పంది రూపం ధరించి నిండు గర్భిణి అయిన పులోమను ఎత్తుకొని పారి పోయాడు. అలా పోతుంటే, ఆమెకు ప్రసవం వచ్చింది. చ్యవనుడు అనే బాలుడు పుట్టాడు. ఆ బాలుడి తేజస్సుకు, శక్తికి, ఆ రాక్షసుడు భస్మం అయ్యాడు.

తరువాత పులోమ కొడుకు ను ఎత్తుకొని ఆశ్రమానికి వచ్చింది. భర్త ఇంటికి రాగానే జరిగిందంతా భర్త అయిన భృగువుకు చెప్పింది. "పులోమ తన భార్య అన్న విషయం ఆ రాక్షసుడికి ఎలా తెలిసింది" అని అడిగాడు. "అగ్నిదేవుడు చెప్పాడు" అని బదులిచ్చింది పులోమ. వెంటనే భృగువు కోపించి, అగ్నిదేవుడిని "నువ్వు సర్వ భక్షకుడివి కమ్ము" అని శపించాడు.

దానికి అగ్నిదేవుడు "అయ్యా, నేను అసత్య దోషానికి భయ పడి నిజం చెప్పాను. దానికి నువ్వు శపించావు. సర్వ భక్షకుడైన నేను

దేవకార్యములకు,పితృ కార్యములకు అనర్హుడను" అని తన జ్వాలలను ఉప సంహరించాడు. దానితో లోకంలో అగ్ని కార్యాలన్ని ఆగిపోయాయి వెంటనే బ్రహ్మ దేవుడు అగ్ని దేవుడిని అనునయించాడు.

"అగ్ని దేవా, నువ్వు సర్వ భక్షకుడివైనను, సర్వ కార్యాలలో ప్రధముడివి . నువ్వు ఎప్పటికి పవిత్రుడివే. కాబట్టి మరల నీ తేజము ప్రజ్వరిల్ల చేయుము" అని అర్థించాడు. దానికి అగ్నిదేవుడు సమ్మతించాడు. తరువాత, దేవ కార్యాలు,పితృ కార్యాలన్ని యధావిధిగా సాగిపోయాయి.

భృగు పుత్రుడైన చ్యవనునికి,శర్యాతి మహారాజు కూతురు సుకన్యకు వివాహమైంది. వారికి ప్రమతి అనే కొడుకు పుట్టాడు. ప్రమతికి, ఘృతాచి అనే అప్సరసకు పుట్టిన వాడు రురుడు. రురుడు, స్థూల కేశుడు అనే ముని ఆశ్రమంలో పెరుగుతున్న అందాలరాశి, ప్రమద్వర అనే అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు.

కాని ఒక రోజు ప్రమద్వరను పాము కరిచింది. మరణించింది అది చూచి రురుడు ఏడ్చాడు. ఒంటరిగా అడవికి పోయి తన ప్రేయసికి ఎక్కిన విషాన్ని హరించమని అందరు దేవతలను, మునులను అర్థించాడు. అప్పుడు ఆకాశం లో నుండి ఒక దేవత ఇలా పలికింది

"మహాత్మా! పుట్టిన వారు చావక తప్పదు. కాని నీ ఆయుష్షులో సగం ఆమెకు ఇస్తే ఆమె బతుకుతుంది" అని చెప్పింది.

వెంటనే రురుడు దానికి అంగీకరించాడు. తన ఆయుష్షులో సగం

ప్రమద్వరకు ఇచ్చాడు. ఆమె బతికింది.తరువాత రురుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. కాని రురుడికి పాముల మీద కోపం పోలేదు. ఒక పొడుగాటి కర్ర తీసుకొని కనిపించిన పామునల్లా చంపడం మొదలు పెట్టాడు

ఒక రోజు డుంఢుభము అనే విషము లేని పామును చూచాడు. ఆ డుండుభమును కొట్టబోగా ఆ పాము ఒక మునిగా మారి పోయింది. రురుడు ఆశ్చర్య పోయాడు.

“అయ్యా మీరు ఎవరు. ఈ పాము రూపంలో ఎందుకు ఉన్నారు” అని అడిగాడు.

దానికి ఆ ముని "మహాత్మా, నాపేరు సహస్ర పాదు డు. ఒక రోజు నేను నా సహచరుడు ఖగముడి మీద పరిహాసానికి, ఒక గడ్డి పాముని వేసాను. దానికి అతడు కోపించి, నన్ను విషము లేని పాముగా పడి ఉండమని శపించాడు. రురుడు అనే ముని కుమారుడు నన్ను చూచినపుడు నాకు శాప విముక్తి కలుగుతుంది అని చెప్పాడు” అని తన కధను వివరించి"అయ్యా మీరు బ్రాహ్మణులు. దయాగుణము కల వారు. అందుకు విరుద్ధంగా, నువ్వు ఎందుకు ఈ విధంగా పాములను చంపుతున్నావు? ఇది వరకు, నీ తండ్రికి శిష్యుడైన ఆస్తీకుడు, కద్రువ తన కొడుకులకు ఇచ్చిన శాప కారణంగా జనమేజయుడు నిర్వహించిన సర్పయాగములో ఆహుతి అవుతున్న పాములను కాపాడాడు. అదే విధంగా నువ్వు కూడా ఈ పాములను చంపడం ఆపు” అని అన్నాడు. అప్పుడు రురుడు పాములను చంపడం ఆపి వేసాడు.

Read mahabharatam online | www.telugubooks.tk

ఈ కథ వింటున్న శౌనకాది మహా మునులు ఆ కథకుని చూచి “అయ్యా, తల్లి కొడుకులకు శాపం ఇవ్వడమేమిటి, సవిస్తరంగా తెలపండి” అని అడుగగా, ఆ కథకుడు ఇలా చెప్ప సాగాడు.

# మహాభారతం

## ఆదిపర్వము

(ప్రథమాశ్వాసము సమాప్తము)